సెంట్రల్‌లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్



వడ్డెర కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శ్రీనివాస్



వాంబేకాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం 63వ డివిజన్ రాజీవ్‌నగర్ వడ్డెరకాలనీలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ పర్యటనలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు 20 నుంచి 30వేల మెజార్టీతో అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొండా ఉమా ఒక బ్లాక్‌మెయిలర్, గూండా, రౌడీ, మహిళల జీవితాలతో ఆడుకున్న వ్యక్తి అని విమర్శించారు. బొండా గతంలో ఎమ్మెల్యేగా ఏం చేశాడో, తర్వాత ఏ రకంగా ప్రవర్తించాడో తెలుసన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల భూములను కబ్జా చేసిన వ్యక్తి ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నాడని పేర్కొన్నారు. అతన్ని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని వెల్లడించారు. ప్రజల మేలు కోరుకున్న వ్యక్తిని సెంట్రల్‌లో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వడ్డెర కాలనీలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందాయన్నారు. కరోనా సమయంలో కూడా ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత సీఎం జగనన్నదేనని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఈ నెల పెన్షన్ అందలేదని బాధపడుతున్నారని వారి ఉసురు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరికి తప్పక తగులుందన్నారు. వలంటీర్లు ఏమి చేశారని వారితో పెన్షన్లు ఇవ్వకుండా చేశారని వెలంపల్లి ప్రశ్నించారు. ఈ నెల రెండో తేదీ వచ్చినా పెన్షన్లు అందలేదని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి నాయకులు పేదలపై కక్ష కట్టినట్టుగా ఉందని, వలంటీర్లు లేకపోతే పెన్షన్లు ఎలా ఇస్తారన్నారు. చంద్రబాబు వలంటీర్లను ఆపమని ఎన్నికల కమిషన్‌కు లెటర్ రాసి తన తొత్తులను పంపాడన్నారు. పేదలకు అన్యాయం చేసే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి రాష్ట్రంలో ఉండకూడదన్నారు. ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పర్యటనలో వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి యేసు, సీహెచ్ రవి, టిక్కం కృష్ణ, మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మి, సామ్రాజ్యం, తిరుపతిరావు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమికి గుణపాఠం తథ్యం..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి నెలా ఇంటికి వచ్చి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు వలంటీర్లు అందించే పింఛన్ ప్రక్రియను అడ్డుకున్న చంద్రబాబు, వారి మాయకూటమికి ఈ ఎన్నికల్లో పెన్షన్‌దారులు తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌ఛార్జ్ బెవర నారాయణతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలకు అందించిన పథకాలు, వాంబేకాలనీలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ రెండు దశాబ్దాల నుంచి వాంబేకాలనీ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిజం చేసి చూపిన ఘనత వైఎస్సార్ సీపీదేనని అన్నారు. గతంలో టీడీపీ పాలకులు కేవలం ఓట్లు, పచ్చనోట్ల కోసం ఇక్కడి ప్రజలను ఇళ్ల రిజిస్ట్రేషన్ల పేరుతో వాడుకుని వదిలేస్తే మన సీఎం జగనన్న వీరి కలలను సాకారం చేశారని అన్నారు.

నీ కళ్లు చల్లబడ్డాయా చంద్రబాబు..?

ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి ఇచ్చే పెన్షన్ రాకపోవడంతో రాష్ట్రంలోని దివ్యాంగులు, అవ్వాతాతలంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని.. వారి కన్నీళ్లతో చంద్రబాబు, టీడీపీ నాయకుల కళ్లు చల్లబడుతున్నాయని వెలంపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్‌దారుల ఆగ్రహానికి మాయకూటమి బంగాళఖాతంలోకి కొట్టుకుపోవడం తథ్యమన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి, షర్మిలమ్మ అంతా కలిసి పేదల మీద కక్ష సాధిస్తున్నారని అన్నారు. నాలుగేళ్లుగా ఇంటింటికి పింఛన్ ఇస్తున్న వలంటీర్లను ఆపించి ఈ ఎండల్లో వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయడం టీడీపీకి సమంజసమా అని ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఎప్పుడైనా పింఛన్ ఇంటికి పంపించావా బాబు అని ప్రశ్నించారు. చంద్రబాబు సుపుత్రుడు లోకేష్ మంగళవారం జరిగిన ఒక సభలో మాట్లాడుతూ నేను చెప్పిన వాడికే పింఛన్, మా కౌన్సిలర్ చెప్పిన వాళ్లకే రేషన్ ఇస్తామని చెప్పడం దుర్మార్గమని, ఇటువంటి వారికి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని నిలదీశారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు ఇచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన నాయకులైన వర్ల రామయ్య, బుద్దా వెంకన్న, పోతిన మహేష్‌లకు కూడా సీఎం జగనన్న పథకాలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల దుర్గారావు, పొదిగింటి నాగరాజు, సిరిశెట్టి రాజా, ఎండీ ఇస్మాయేల్, బాబు, మూర్తి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

6న సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల ఆరో తేదీ రాఘవయ్య పార్క్ ఎదురుగా గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం, సాంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తేదీ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 9440263055 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎన్నికల్లో మద్యం పంపిణీకి స్వస్తి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉచితంగా మద్యం పంపిణీకి స్వస్తి పలికి ఓటర్లు, కార్యకర్తలు, యువతను కాపాడాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వేచ్ఛాయుత ఎన్నికలు-మద్యం ప్రభావం-నియంత్రణ మన ముందున్న సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఉచితంగా మద్యం పంపిణీ వల్ల యువతకు మద్యం అలవాటు అవుతుందన్నారు. అభ్యర్థులు ఖర్చు పెట్టే వ్యయంలో 25శాతం మద్యం పంపిణీకే కేటాయిస్తున్నారని తెలిపారు. తాగుడు తప్పు అనే భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మద్య నిషేధం కన్న నియంత్రణ ఆచరణ సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్యంపై జాతీయ విధానాన్ని ప్రకటించాలని కోరారు. సమావేశంలో జాతీయ మహిళా సమాఖ్య నేత అక్కినేని వనజ, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ, గద్దె అనురాధ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 తేదీ నుంచి కట్టింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్, జ్యూస్ అండ్ జామ్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420 నెంబర్‌లో కాని సంప్రదించాల్సిందిగా కోరారు.

కిటకిటలాడిన దాసాంజనేయస్వామి ఆలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ముగియడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఎండల్లో దాహార్తులు, పాదచారులకు తమ వంతు సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా అన్నారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం హెల్పింగ్ ట్రస్ట్ ఆధ్వర్యాన పాదచారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఎవరికి వారు తమ వంతు బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగను పంపిణీ చేయాలని సూచించారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 1200 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, హేమంతరావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల ఒకటో తేదీ తెల్లవారు జామున బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు మృతి చెందినట్లు సూర్యారావుపేట సీఐ వి.దుర్గారావు తెలిపారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో నిద్రిస్తున్న యాచకుడిపై గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో అతనికి తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. ఈ విషయం గమనించిన సమీపంలోని వ్యక్తులు అతన్ని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. చికిత్స పొందుతూ మంగళవారం యాచకుడు మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామం పడమటిచెరువు ప్రాంతానికి చెందిన నామాల వీణ 2022వ సంవత్సరంలో తెనాలికి చెందిన అంబటి మదన్‌ను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త టింబర్ వ్యాపారం చేస్తాడని, హైదరాబాద్‌లో కూడా వ్యాపారం ఉందని తెలిపారు. వీణ బీటెక్, ఎంబీఏ చదివింది. పెళ్లి జరిగిన కొద్ది రోజులకు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కొద్ది రోజుల కాపురం సాఫీగానే జరిగింది. అయితే ఆ తరువాత అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త అంబటి వెంకటరమణమ్మ, ఆడపడుచు భాగ్యాలు, లీల వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. 200 మంది భక్తులకు కాపల్లి రాఘవరాజు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పెన్షన్ అందేది ఎలా..?

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి నెలా మాదిరిగానే వలంటీర్ వస్తాడు.. పెన్షన్ ఇస్తాడు.. అని దివ్యాంగులు, అవ్వాతాతలు, వితంతువులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఠంఛన్‌గా ఒకటో తేదీన తలుపుతట్టి అందించే పెన్షన్ ఇంత వరకు రాకపోవడంతో పెన్షన్‌దారులు తల్లడిల్లిపోతున్నారు. ప్రతిపక్షాల పుణ్యమాని వలంటీర్లు పెన్షన్ పంపిణీకి దూరమయ్యారు.

సచివాలయానికి వెళ్లలేను



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వలంటీర్ కిరణ్మయి ఠంఛన్‌గా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పెన్షన్ అందజేసేది. ఇప్పుడు రెండో తారీఖు వచ్చేసింది. కానీ ఇంత వరకు పెన్షన్ రాలేదు. నాకు వచ్చే పెన్షన్ డబ్బులతోనే అవసరమైన మందులు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. అసలే ఒక పక్క పార్కిన్‌సన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాను. ఇప్పుడు సచివాలయంకు వెళ్లి పెన్షన్ తీసుకోవాలని అంటున్నారు. ఈ వయస్సులో ఇన్ని సమస్యలతో నేను ఏ విధంగా పెన్షన్ తీసుకోవడానికి వెళ్లాలో అర్థం కావడం లేదు.

-జీ శ్రీనివాసరావు, బావాజీపేట

మళ్లీ పాత రోజులు వచ్చాయి



గతంలో పెన్షన్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఆ సమస్యలు తీరాయి అనుకునేలోపు మళ్లీ ఇప్పుడు వార్డు సచివాలయంకు వెళ్లి పెన్షన్ తీసుకోవాలని చెబుతున్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వంలోని పాత రోజులు వచ్చినట్టు అనిపిస్తోంది. అసలే రోజు కూలి మీద జీవించే మాకు పెన్షన్ కోసం సచివాలయం చుట్టూ ఎలా తిరగాలి. గతంలో మాదిరిగా పెన్షన్‌ను ఇంటి వద్దనే అందించాలి.

-కర్రి లక్ష్మి, దుర్గాపురం

రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా వించిపేట షాహీ మసీదు ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైందిగా ఇస్లాం గ్రంథాలు చెబుతున్నాయన్నారు. పేదల ఆకలిదప్పికలు తెలుసుకునేందుకు ఉపవాస దీక్షలను ఆచరిస్తారని, అటువంటి మంచి సందేశాన్నిస్తున్న ఆచారాలు అందరికీ స్ఫూర్తినిస్తాయన్నారు. వెస్ట్‌జోన్‌లో ముస్లిం సోదరులు అధికంగా ఉన్నారని, వారందరికీ ఈ రంజాన్ మాసం మేలు చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐలు గణేష్, కృష్ణ, శేఖర్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేత వాహాబ్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన.. ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్ ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట రోడ్డు పరిధిలోని ప్రైజర్‌పేట కటికల వారి వీధి వద్ద మల్లికార్జునపేటకు చెందిన బైపు రామకృష్ణ, కేఎల్‌రావునగర్‌కు చెందిన లండా ప్రశాంత్ కలిసి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్‌ల ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకునే సరికి రోడ్డుపై వెళ్లే వారిని ఆపి, ఇద్దరికి మద్దతుగా సంతకాల సేకరణ చేస్తున్నట్లు టీం సభ్యులు గుర్తించారు. సంతకాల సేకరణ చేస్తున్న వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. అయితే ఎటువంటి అనుమతి తీసుకోలేదని సదరు యువకులు పేర్కొనగా, వారిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ గణేష్ కేసు నమోదు చేశారు.

ఆటిజంను ఆరంభ దశలోనే గుర్తించాలి



ఆటిజం గురించి వివరిస్తున్న డాక్టర్ కృష్ణకుమారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటిజం అంటే చైల్డ్‌హుడ్ న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్ అని దానిని ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ టీ కృష్ణకుమారి అన్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. కృష్ణకుమారి మాట్లాడుతూ ఆటిజం అనేది చిన్నారుల్లో ఏడాదిన్నర నుంచి మూడేళ్లలోపు వయస్సులోనే సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. చిన్నారులు తక్కిన పిల్లలతో కలవకపోవడం, కళ్లలో కళ్లుపెట్టి చూడకపోవడం, స్పీచ్ అండ్ లాంగ్వేజీ సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు అన్ని విషయాలు క్షుణంగా పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్వీకార్ అండ్ ఉపకార్ స్పీచ్ పథాలజిస్టు శృతిపాటిల్ చిన్నారుల్లో స్పీచ్ డిలేకు సంబంధించిన వివిధ రకాల అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



31వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ శిరీష

మధురానగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలతో ప్రతీ ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లతో కలిసి ఆమె పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకం అయ్యి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పేదల సంక్షేమం కోసం పరితపిస్తుంటే చంద్రబాబు కుటిల రాజకీయాలతో పెన్షన్ అందకుండా చేశారని దుయ్యబట్టారు. పేదల కోసం పనిచేసే నాయకుడు సీఎం జగనన్నకు బాసటగా నిలవాలని, ప్రజలకు అందుబాటులో ఉండే మంచి మనిషి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని నానిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స సత్యం, వెంకటరెడ్డి, బాలవర్ధనరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయిస్తున్న రమాదేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలల పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. గ్రంథాలయాధికారి రమాదేవి మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో, మంచి పుస్తకం మంచి మిత్రుడు లాంటిది, ఒక మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది అని కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటలు విద్యార్థులకు వివరించి పుస్తకం విలువను తెలియజేశారు. 10 మందితో వృథాగా కాలక్షేపం చేసే బదులు ఒంటరిగా కూర్చుని ఒక మంచి పుస్తకం చదవడం మేలన్నారు. పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



64వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం 64వ డివిజన్‌లో కేకే అపార్టుమెంటు ఏరియాలో ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ నియోజవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శ్రీనివాస్(నాని)లను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, డాక్టర్ చిన్నా, ఇన్‌చార్జి జె.శివ, పందిరి వాసు, బత్తుల శేఖర్, పరిమి నాగేశ్వరరావు, మీసాల రామకృష్ణ, మాతా సతీష్, వెంకటేశ్వరమ్మ, రామతులశమ్మ, సావిత్రమ్మ, మాలంబీ, వరాలమ్మ, త్రినాథ్, రావి విమల, కిరణ్, లక్ష్మణ్, బాషా, దిలీప్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

'పారిజాత పర్వం' అలరిస్తుంది



మాట్లాడుతున్న పారిజాత పర్వం మూవీ హీరో చైతన్యరావు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో పారిజాత పర్వం చిత్ర యూనిట్ మంగళవారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఓ హోటల్లో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో చైతన్యరావు మాట్లాడుతూ కిడ్నాప్ కామెడీ డ్రామాతో పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమన్నారు. ఒక కిడ్నాప్ ఇతివృత్తంగా ఈ చిత్రం సాగుతుందని, ప్రముఖ నటులు సునీల్ ఈ చిత్రంలో ఒక మంచి పాత్రలో కనబడతారని, ఆయన పాత్ర ఈ చిత్రానికి హైలైట్‌గా ఉంటుందని వివరించారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ పలు క్యారెక్టర్లలో నటించిందని ఈ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 19న థియేటర్లలో రిలీజ్ కానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. హీరోయిన్ శ్రద్ధ దాస్ మాట్లాడుతూ కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. అనంతరం ప్రముఖ కమెడియన్ వైవా హర్ష మాట్లాడుతూ ఈ చిత్రంలో వచ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో నవ్విస్తాయని తెలిపారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ గతంలో ఎన్నో కిడ్నాప్ కామెడీ చిత్రాలు వచ్చాయని ఈ చిత్రం పూర్తి స్థాయి భిన్నంగా ఉంటుందన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన మల్లిశెట్టి అనూష బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన జరిగింది. పలు కీర్తనలకు చిన్నారులు అద్భుతంగా నృత్య ప్రదర్శన ఇవ్వగా, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని చింతపల్లి లక్ష్మికి చెందిన తాటాకుల ఇంటి పైకప్పుపై మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా భావిస్తున్నారు. రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వీరవల్లికి చెందిన దేవరకొండ శివశంకర్ సోమవారం రాత్రి 10 గంటల సమీపంలో ద్విచక్ర వాహనంపై హనుమాన్‌జంక్షన్ వచ్చి తన ఇంటికి తిరిగి వెళ్తుండగా హెచ్ మార్ట్ సమీపంలో రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో శివశంకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ జనార్దన్ కేసు నమోదు చేశారు.